సాక్షి జనగామ

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

సిద్ధమైన గణపతి మండపం



జిల్లా కేంద్రంలో పూలు, పత్రుల అమ్మకాలు



జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ





గణపతింభజే..

● నేడు వినాయక చవితి
● సిద్ధమైన నవరాత్రి ఉత్సవ మండపాలు

జనగామ: ప్రకృతిలో లభించే వివిధ రకాల పత్రులతో పూజించే ప్రధాన పండుగ వినాయక చవితి. మానవ ఆరోగ్యానికి ఉపయోగపడే అనేక ఔషధ గుణాలున్న ప్రకృతిని దైవ సమానంగా చూసుకోవాలనే ఆంతర్యం దాగిఉండడం ఈ పండుగ ప్రత్యేకత. శనివారం వినాయక చవితి పండగను పురస్కరించుకుని గణేశ్ ప్రతిమలు, పత్రులు, పండ్లు, పూలు, పూజాసామగ్రి కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన నవరాత్రులు పూజించేందుకు మండపాలను సిద్ధం చేశారు. పండుగ నేపథ్యంలో జనగామ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. బతుకు దెరువుకోసం, ఉద్యోగాల నిమిత్తం, ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. గణేశ్ నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో జరిగేలా డీసీపీ రాజమహేంద్రనాయక్ నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

16న నిమజ్జనం

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఈనెల 16వ తేదీతో ముగుస్తాయి.. అదే రోజు నిమజ్జనం ఉంటుందని గణేశ్ ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ మంచాల రవీందర్ తెలిపారు. శుక్రవారం సంతోషిమాత ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తిభావం ఉట్టిపడుతూ, సంస్కృతీ సంప్రదాయాలతో అలంకరించిన మండపాలకు కమిటీ తరఫున బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఉత్సవ కమిటీ మండపాలను సందర్శించి ఎంపిక చేస్తుందని చెప్పారు. రంగ నర్సింగరావు, అర్జున్ సింగ్, సతీష్, భోగ కైలాసం, సత్యం, పవన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆర్డీఓ కొమురయ్య, ఏసీపీ పార్థసారధి



జనగామ: పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జనగామ ఆర్డీఓ కొమురయ్య, ఏసీపీ పార్థసారధి పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ వెంకన్న, సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి హిందూ, క్రిస్టియన్, ముస్లిం సంఘాల పెద్దలతో పీస్ కమిటీ(శాంతి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగానే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని కోరారు. గణేశ్ మండపాల వద్ద తీసుకునే జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



జనగామ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర పరిశీలకులు ధరేంద్ర ఆధ్వర్యాన నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కె.జితేందర్, ఉపాధ్యక్షుడిగా చాగంటి శ్రీనివాస్, కార్యదర్శిగా జి.మల్లేష్, మహిళా కార్యదర్శిగా సునంద ఎన్నికయ్యారు. నూతన కమిటీని సన్మానించారు.

వక్ఫ్‌బోర్డ్ బిల్లు వెనక్కి తీసుకోవాలి



జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డ్ బిల్లును వెనక్కి తీసుకోవాలని ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జమాల్ షరీఫ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జామీయా మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిల్లు వెనక్కి తీసుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 2024 వక్ఫ్ బోర్డ్ బిల్లు ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా ఉందని, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా కార్యక్రమాలు, పథకాలు తీసుకురావాలని అన్నారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన స్లాట్ బుకింగ్

జనగామ రూరల్: దివ్యాంగుల సదరం శిబిరానికి శుక్రవారం మీసేవలో స్లాట్ బుకింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా.. సాంకేతిక సమస్యతో కాలేదని డీఆర్డీఓ వసంత ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వారు, రెన్యూవల్‌కు గడువు ఉందని, స్లాట్ బుకింగ్‌కు 5 రోజుల సమయం పడుతుందన్నారు. రాష్ట్ర అధికారులు తేదీలను ప్రకటిస్తారని పేర్కొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



జనగామ రూరల్: అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని(డీఐఓ) జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి స్వర్ణకుమారి అన్నారు. శుక్రవారం పెంబర్తి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించిన ఆమె మాట్లాడారు. పోషణ మాసంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేస్తున్నామని చెప్పారు. చిన్నారులకు రోజూ బాలామృతం, పాలు, గుడ్లు అందజేయాలని అన్నారు. టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడు

● జిల్లా విద్యాధికారి రాము



రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ రాము, తదితరులు

జనగామ రూరల్: ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడు.. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా విద్యాధికారి కే.రాము అన్నారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ ధర్మకంచ హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు తండ్రి దామోదర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యానంతరం విద్యా అవకాశాలు అంతంతమాత్రంగానే ఉండేవని, ఆ సమయంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉపాధ్యాయ వృత్తికి రాధాకృష్ణన్ ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు. దేశానికి రాష్ట్రపతిగా, ఉప రాష్ట్రపతిగా పలు హోదాల్లో సేవలందించిన ఆయన అడుగు జాడల్లో విద్యార్థులు, యువత పయనించాలని కోరారు. అనంతరం విగ్రహదాత శ్రీనివాస్‌రావును డీఈఓ సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ యాస్మిన్, ఏసీజీ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మోనికుంట సగం..



ధర్మోనికుంట(బతుకమ్మకుంట) పరిధిలో సుమారు 17 ఎకరాల శిఖం ఉండగా, ఇందులో 81 సర్వే నంబర్‌లో రెండెకరాలు, 86 నంబర్‌లో ఒక ఎకరం, 92 నంబర్‌లో రెండెకరాలు, 93 నంబర్‌లో మూడు ఎకరాలు.. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో మొత్తం 8 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గతంలోనే ఇరిగేషన్ అధికారులు గుర్తించి అప్పటి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఓ సర్వే నంబర్‌లో ఒక నిర్మాణం మొదలు కాగానే.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని నోటీసులు జారీ చేసి పనులు నిలిపివేయించారు. బతుకమ్మకుంట సమీప ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ప్లాట్ల అమ్మకాలు, నిర్మాణాలు జరిగినట్లు ఇరిగేషన్ అధికారులు లెక్క తేల్చి.. అందులో పలువురికి నోటీసులు సైతం జారీ చేశారు. ఐదేళ్ల క్రితమే ధర్మోనికుంట పరిధిలో రెండు అక్రమ నిర్మాణాలు, 25 వరకు ప్లాట్ల అమ్మకాలు జరిగినట్లు గుర్తించగా.. నాటి నుంచి నేటి వరకు మరిన్ని పెరిగాయి.

ప్లాట్లుగా రంగప్పచెరువు..



రంగప్పచెరువు ఎఫ్‌టీఎల్ పరిధి సుమారు 40 ఎకరాలుంటుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. గతంలో చెరువు ఎఫ్‌టీఎల్ లెక్కించగా 32 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు సమాచారం. రియల్టర్లతో కుమ్మక్కైన కొందరు అక్రమార్కులు చెరువు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించారు. అసలు శిఖం భూమిలో 8 ఎకరాలు తగ్గించడమే కాకుండా.. ఎఫ్‌టీఎల్ పరిధిలో 6 ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లు తేలింది. ఈ చెరువు పరిధిలో 463 సర్వే నంబర్ మాయంపై చర్చ జరుగుతోంది. సంబంధించిన కాపీ సెత్వార్(సుమారు 70ఏళ్ల క్రితం నకలు)లు జిల్లా సర్వే ల్యాండ్ కార్యాలయంలో ఉన్నట్లు అప్పటి సర్వే అధికారి కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో 9.38 ఎకరాలు ఉండగా.. పుల్లారి హనుమయ్య పేరున పట్టా ఉందని, ఎఫ్‌టీఎల్ పరిధి ఎంతనే దానిపై సెత్వార్ ఒరిజినల్ కాపీలను కాజీపేట ల్యాండ్ భూసర్వే విభాగం నుంచి తెప్పిస్తామని చెప్పి ఐదేళ్లు దాటింది.

తాటికొండలో ఎలుగుబంటి



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ శివారులో ఎలుగుబంటి సంచరించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రోజూ మాదిరిగానే గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళ్తుంటే కొంత దూరంలో ఎలుగుబంటి కనిపించగా భయాందోళనకు గురయ్యారు. కాగా మనుషుల అలికిడి విన్న ఎలుగుబంటి గుట్టలవైపు వెళ్తుంటే కొందరు సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీశారు. గ్రామం చుట్టూ కొండలు, దట్టమైన చెట్లు ఉండటంతో ఎలుగుబంటి అటుగా వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

కుంటలు కబ్జా..



"'హైడ్రా'తో హైదరాబాద్‌లో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఏ జిల్లాకు ఆ జిల్లా కలెక్టర్ బాధ్యత తీసుకోవాలి. మీ పరిధిలోని ఆక్రమణలపై మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో నివేదిక తయారు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా ఏ నిర్మాణం ఉన్నా తొలగించాలి."

\- ఇటీవల మహబూబాబాద్‌లో జరిగిన వరద సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



ఆక్రమణలో..'ఎఫ్‌టీఎల్-బఫర్‌జోన్'

● అడ్డగోలు నిర్మాణాలు.. గుడ్డిగా అనుమతులు
● ఇరిగేషన్ అధికారులు అడ్డగించినా..ఆగని కబ్జా
● 'సాక్షి' కథనాలతో సీఎంఓకు ఫిర్యాదు
● సీఎం ఆదేశాలు అమలయ్యేనా..!

జనగామ: పట్టణంలోని రంగప్ప చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జాల పర్వం రెండు శాఖలను కుదిపేస్తుండగా.. ధర్మోనికుంట, గార్లకుంట, కుమ్మరికుంట, కొత్తచెరువులో అక్రమ నిర్మాణాలకు అనుమతులు దుమారం రేపుతున్నాయి. ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) పరిధిలో ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గతంలో ఇరిగేషన్ అధికారులు హెచ్చరించి నోటీసులు ఇచ్చినా నిర్మాణాలు ఆగడం లేదు. ఫ్లోర్ల మీద ఫ్లోర్లు వేసుకుంటూ పురపాలిక అనుమతులు సైతం పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చెరువుల పరిరక్షణకు సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కలెక్టర్, ఇతర అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. చెరువుల్లోని ఆక్రమణలను తొలగించాలని సూచించారు. అయితే అధికారులు ఎలా స్పందిస్తారు.. గతంలో మాదిరిగా చూసీ చూడనట్లు వదిలేస్తారా.. లేక ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతారా అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

రియలెస్టేట్ గుప్పిట్లో కొత్త చెరువు..

హైదరాబాద్ రోడ్డులోని కుమ్మరికుంట పరిధి కొత్త చెరువు సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తలొంచక తప్పలేదు. ఈ చెరువులోని ఎఫ్‌టీఎల్ ఆధీనంలో ఉన్న సుమారు 18 ఎకరాల్లో సుమారు 20 ప్లాట్లకు పైగా అమ్మకాలు చేయగా.. పలు నిర్మాణాలు జరిగినట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు గతంలోనే ఉన్నతాధికారులకు నివేదికలను పంపించారు.

చర్యలకు వెనకడుగు..?

రంగప్పచెరువు, ధర్మోనికుంట, గార్లకుంట, కొత్త చెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు కబ్జాకు గురైనట్లు నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించినా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారు. చెరువులు, కుంటల మాయంపై ఇరిగేషన్ అధికారులు లెక్కలు వేసి సాక్ష్యాలు చూపించినా.. వాటిని ఖాతరు చేయడం లేదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్ల అమ్మకాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ యథేచ్ఛగా భవనాలు వెలుస్తున్నాయంటే దీని వెనుక చక్రం తిప్పే వారు ఎవరనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

'సాక్షి' క్లిప్పింగ్‌తో సీఎంఓకు ఫిర్యాదు



'హైడ్రా' గుబులు..?

చిన్నా పాటి వర్షాలకే ముంపునకు గురవుతున్న జనగామ పట్టణ ప్రజలను కాపాడాలి. చెరువులు, కుంటలు ఆక్రమణ, కబ్జాకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అమ్మ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వంగ భీమ్‌రాజ్ సీఎంఓ కార్యాలయానికి ఎక్స్‌లో 'సాక్షి' వరుస కథనాలను జత పరిచి ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుని, వాటిని కొనుగోలు చేసిన ప్రజలకు ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు.

బాధితులకు అన్యాయం జరగొద్దు




పట్టణంలో చెరువులు, కుంటల కబ్జా, ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలి. మాయమైన సర్వే నంబర్ సంగతి తేల్చాలి. అమాయక ప్రజలను బురిడీ కొట్టించి ఎఫ్‌టీఎల్‌లో ప్లాట్లు అమ్మించిన వారిపై చర్యలు తీసుకుని బాధితులకు అన్యాయం జరగకుండా చూడాలి.

\- మల్లిగారి రాజు, జనగామ

గార్లకుంటలో అదేతంతు..

కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న గార్లకుంటలోనూ ఇదే పరిస్థితి. కుంట పరిధిలో 22 ఎకరాలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కింద ఉండగా.. నిర్మాణాల సంఖ్య రెండంకెలు దాటినట్లు సమాచారం. వీటికి సంబంధించి అనుమతులు ఆపేయాలని ఇరిగేషన్ శాఖ అప్పట్లో కోరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. కుంట మధ్యలో నిర్మాణం చేసిన భవనం.. అధికారుల కక్కుర్తికి నిదర్శనంగా నిలుస్తున్నది.


ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు తప్పనిసరి..



"చెరువులు, కుంటల ఏరియాలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, రెడ్‌జోన్ హద్దులు తప్పక ఉండాలి. తహసీల్, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చెరువులకు సంబంధించిన సర్వే నంబర్లు, ఎఫ్‌టీఎల్ వివరాలు ఉండాలి. ఒక వేళ తెలియకుండా రిజిస్ట్రేషన్‌కు వెళితే తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రతీ చెరువు వద్ద అందరికీ కనిపించేలా ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి.. అక్కడే మ్యాప్ అందుబాటులో ఉంచాలి."

\- ఎండీ.అబ్దుల్ ఖాదర్, జిల్లా రియలెస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

రెండు చెరువులపై ఫిర్యాదు



జనగామ పట్టణంలోని రంగప్పచెరువు, బతుకమ్మకుంట(ధర్మోనికుంట)లు కబ్జా, ఆక్రమణకు గురయ్యాయని, సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదులు వచ్చాయి. 'హైడ్రా' తరహా మిషన్ ఏర్పాటుకు జీఓ కోసం వేచి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే నిబంధనలను అనుసరించి ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రెండు చెరువులపై జాయింట్ సర్వే కోసం ఆదేశాలు జారీ చేశాం.

\- షేక్ రిజ్వాన్ బాషా, కలెక్టర్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవీందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రవీందర్

బచ్చన్నపేట: వర్షాలు కురుస్తున్నందున వ్యాధుల విషయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వైద్య సిబ్బంది సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. వ్యాధుల నియంత్రణకు సంబంధించి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని చెప్పారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది మలేరియా, డెంగీ, అతిసార లాంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ వీరాంజనేయులు, వైద్యులు సృజన, మానస, ప్రసన్న, కృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం..

జనగామ రూరల్: ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాలను పుస్కరించుకొని శుక్రవారం జిల్లా కార్యాలయం, రైల్వేస్టేషన్, అంబేడ్కర్ నగర్, తహసీల్ కార్యాలయం, బాణాపురం, ఏసీరెడ్డినగర్‌లో పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కనకారెడ్డి మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో 4వేల మంది అమరులయ్యారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాంబరాజు యాదగిరి, బూడిద గోపి, ఉపేందర్, అహల్య, మీట్యా నాయక్, హజారుద్దీన్, రజిత, గౌసియా, నాజియా, కమల, మమత, వెంకటేష్, సుధాకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నష్టం అంచనా వేయండి

● కలెక్టర్‌కు ఎమ్మెల్యే 'పల్లా' వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే 'పల్లా'

జనగామ: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కోతకు గురైన, దెబ్బతిన్న రహదారులకు సంబంధించి మరమ్మతులు చేపట్టడానికి నష్టం అంచనా నివేదిక తయారు చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, వంతెనలను వెంటనే బాగు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వరి, పత్తి ఇతర పంటల నష్టంపై సర్వే చేపట్టి బాధిత రైతులకు ప్రభుత్వ పరంగా పరిహారం వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం కలెక్టర్.. ఎమ్మెల్యేతో కలిసి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఈ, డీఈలతో సమీక్ష నిర్వహించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి మరమ్మతులకు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బొల్లం శారద, రేఖ, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి





రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో నీటి నిల్వలను తొలగిస్తున్న ఆశ కార్యకర్తలు, పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

● కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా డ్రై డే నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ప్రకటన ద్వారా వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారని, మురుగు కాల్వల శుభ్రత, రోడ్లపై చెత్తకుప్పలు, పిచ్చి మొక్కలను తొలగించి, నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారని, నీటి ట్యాంకులను శుభ్రం చేసి ఆయిల్ బాల్స్ వేయిస్తున్నారని తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తడి, పొడిచెత్తను ఇంటి నుంచే వేరు చేసి వాహనాల్లో వేసేలా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సుఖసంతోషాలు

● శ్రీరామదాసు భజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధేశ్వర్

దేవరుప్పుల : ఆధ్యాత్మిక చింతనతో సుఖసంతోషాలు వర్ధిల్లుతాయని శ్రీరామదాసు భజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు మాన్యపు సిద్ధేశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అధికారి రామిరెడ్డి కృష్ణమూర్తి సౌజన్యంతో ఆలయ ప్రధాన అర్చకులు పెద్దాపురం వెంకటేశ్వర శర్మ నేతృత్వాన ఉదయం గణపతి పూజ, అమ్మవారికి నామార్చన, కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆలయానికి గత ఎడాది నుంచి టీటీడీ పరిధి కార్యక్రమాలకు అనుమతి లభించిందన్నారు. పెద్దాపురం శాంత, మద్రి శోభ, చల్ల విజయ, కాసారపు పద్మ, ఈదునూరి నిర్మల, ప్రణీత, కల్పన, తేజస్విని, రెడ్డిరాజుల హేమ, లావణ్య, భజన మండలి ప్రతినిధులు అంబటి సోమయ్య, భిక్షపతి, సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

గుర్తింపు లేని సంఘాలను పట్టించుకోవద్దు

● జిల్లా జేఏసీ చైర్మన్ ఖాజా షరీఫ్

జనగామ: రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరగ్గా.. తమవంతు సాయంగా ఉద్యోగులు ఒక్క రోజు వేతనం ఇచ్చేందుకు ముందుకు రాగా.. కొందరు గుర్తింపు లేని సంఘాలు ఏర్పాటు చేసి అసత్య ప్రచారం చేస్తున్నారని జిల్లా జేఏసీ చైర్మన్ ఖాజా షరీఫ్ అన్నారు. శుక్రవారం టీఎన్‌జీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించి, నేడు నాయకులుగా చెలామణి అవుతున్న వారికి త్వరలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మారం జగదీశ్వర్ మాత్రమే అసలైన జేఏసీ చైర్మన్ అని పేర్కొన్నారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి

లింగాలఘణపురం: పిల్లల్లో ముఖ్యంగా రక్తహీనత లేకుండా చూసుకోవాలని డీడబ్ల్యూఓ జయంతి కోరారు. పోషణ మాసం సందర్భంగా శుక్రవారం కళ్లెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన తల్లులకు అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే బాలామృతం ఉపయోగాలు, అందులో వినియోగించే ఆహార పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు యాదగిరి, చంద్రం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హంసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, శారద, వసంత, మంజుల, అనిత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలి

● ఎస్‌ఆర్‌పీ జీవన్

స్టేషన్‌ఘన్‌పూర్: గత ఏడాది జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ జీవన్ అన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండల పరిధిలో చేపట్టిన ఈజీఎస్ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీపై పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలతో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు రూ.3.89 కోట్ల విలువైన ఈజీఎస్ పనులు జరిగాయన్నారు. డీఆర్‌పీల సూచన మేరకు గ్రామాల్లో ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పనులను పరిశీలిస్తూ బాధ్యతగా తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయశ్రీ, ఈజీఎస్ ఏపీఓ ప్రేమయ్య, డీఆర్‌పీలు నవీన్, రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రక్రియకు డేటా సేకరణ

దేవరుప్పుల: ప్రభుత్వ నిర్దేశిత పంట రుణమాఫీ ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేసేందుకు తలపెట్టిన రైతుల డేటా సేకరణ పూర్తికి విస్తృత చర్యలు చేపడుతున్నట్టు వ్యవసాయశాఖ పాలకుర్తి ఏడీఏ ఎ.పరుశరామ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డులేని పంట రుణమాఫీ పొందని లబ్ధిదారుల కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో వ్యవసాయ అధికారులు సెల్‌ఫోన్‌లో సెల్ఫీ ఫొటో క్యాప్చరింగ్ చేశారు. ఏఈఓలు సంతోష్, భాస్కర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని పూజించండి... సిరిసంపదలతో తులతూగండి

మట్టి గణపతిని పూజిద్దాం..
పర్యావరణాన్ని కాపాడుదాం..


- Advt Feature

వినాయకుడు




వినాయకుడంటే భౌతికంగా మనకు కనిపించే ఆకారం మాత్రమే కాదు.. ఆయన రూపు, స్వభావం వెనుక లోతైన అర్థం ఉందని వేదాంతులు చెబుతుంటారు. గణేశుని ఆరాధనతో బాధల నుంచి సులభంగా విముక్తి పొంద వచ్చని సూచిస్తుంటారు. అందుకే గణేశుడే ప్రముఖంగా ఆరాధించబడే గాణపత్యం అనే శాఖ కూడా ఉంది. వినాయకుని ఆరాధనలో ఆధ్యాత్మిక రహస్యాలు ఎన్నో ఉన్నాయని చెప్పేందుకు ఓ గొప్ప ఉదాహరణ ఆయన అవతారాలు. ముద్గల పురాణం ప్రకారం వినాయకుడు ఎనిమిది అవతారాలను ధరించాడు. ఆ ఎనిమిది అవతారాల వివరాలను, గణనాథుని మహిమలను తెలుసుకుని ఆ వినాయకుని సేవించి తరిద్దాం.

వక్రతుండుడు




పూర్వం ఇంద్రుడు చేసిన ఒక పొరపాటు వల్ల 'మాత్సర్యాసురుడు' అనే రాక్షసుడు ఉద్భవించాడు. అతని ధాటికి ముల్లోకాలూ అల్లాడిపోయి దేవతలంతా దత్తాత్రేయుని శరణు వేడారు. అంతట దత్తాత్రేయుడు, గణపతిని ప్రార్థించమని సూచించాడు. 'గం' అనే బీజాక్షరంతో దేవతలంతా ఆ గణపతిని గురించి తపస్సు చేయగానే 'వక్రతుండుని'గా అవతరించాడు. ఆయన సింహవాహనుడై ఆ మాత్సర్యాసురుని జయించాడు. వక్రతుండం అనేది ఓంకారానికి ప్రతీకగా, మాత్సర్యాసురుడు మనలోని మత్సరానికి (ఈర్ష్య) ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఈ లోకం నాది, ఈ లోకంలో అందరికంటే నాదే పైచేయి కావాలి అనుకున్న రోజున ఈర్ష్యాసూయలు జనిస్తాయి. ఈ జగత్తు ఒక నాటకం మాత్రమే అని గ్రహించిన రోజున మనసులో ఎలాంటి ఈర్ష్య ఉండదు.

ఏకదంతుడు



చ్యవనుడనే రుషి మదాసురుడనే రాక్షసుని సృష్టించాడు. రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు అతనికి 'హ్రీం' అనే మంత్రాన్ని ఉపదేశించి నిరంతరం జపిస్తే ఫలితం దక్కుతుందన్నాడు. లోకాధిపత్యమే అభీష్టంగా గల మదాసురుడు ఆ హ్రీంకారాన్ని యుగాల తరబడి జపించాడు. దాంతో అతనికి కోరుకున్న శక్తులన్నీ లభించి మదాసురునికి తిరుగులేకుండాపోయింది. అతని చేష్టలకు దేవతలంతా భీతిల్లిపోయి సనత్కుమారుని చెంతకు ఉపాయం కోసం పరుగులు తీశారు. సనత్కుమారుని సూచన మేరకు వారంతా గణేశుని కోసం ప్రార్థించగా, ఆయన 'ఏకదంతు'నిగా అవతరించి మదాసురిని జయించాడు. ఇక్కడ మదాసురుడు అంటే మదానికి (గర్వం) చిహ్నం, ఏకదంతుడు ఈ సృష్టి యావత్తూ ఒకటే అన్న అద్వైతానికి చిహ్నం.

మహోదరుడు



శివుడు ఓసారి తీవ్రమైన తపస్సులో మునిగిపోయాడు. ఎంత కాలమైనా ఆయన ఆ తపస్సుని వీడకపోవడంతో పార్వతి కంగారు పడి పరమేశ్వరుని తపస్సు నుంచి బయటకు తీసుకురావాలని గిరిజన యువతిగా మారి ఆయన తపోభంగం కలిగించే ప్రయత్నం చేసింది. పార్వతి చేష్టలకు పరమేశ్వరునికి దిగ్గున మెలకువ వచ్చి ఏం జరిగింది అన్న అయోమయం కూడా ఏర్పడి ఓ రాక్షసుడు జనించాడు. అతనే మోహాసురుడు. ఆ మోహాసురుడు సూర్యుని ఆరాధించి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. దేవతల ప్రార్థనను మన్నించి గణేశుడు లంబోదరునిగా అవతరించాడు. మోహం ఎప్పుడూ అయోమయానికి దారితీస్తుంది. దృక్పథం సంకుచితంగా మారిపోతుంది. అందరూ నావారే అన్న విశాలమైన దృష్టి కలిగిన రోజున ఆ మోహం దూరమైపోతుంది.

గజాననుడు



కుబేరుని ఆశ నుంచి లోభాసురుడు అనే రాక్షసుడు జనించాడు. శివపంచాక్షరిని జపించిన ఆ లోభాసురుడు, శివుని అనుగ్రహంతో ముల్లోకాలనూ జయించే వరాన్ని పొందాడు. కానీ అతని లోభానికి అంతులేకుండా పోయింది. చివరికి శివుని కైలాసాన్ని కూడా తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న దేవతలు రైభ్యుడనే రుషిని శరణువేడారు. గణపతిని కనుక ఆవాహన చేస్తే, లోభాసురుని పరాజయం ఖాయమని సూచించాడు. అలా సకల దేవతల ప్రార్థనలను మన్నించి గణేశుడు 'గజాననుడి'గా అవతరించి లోభాసురుని జయించాడు. గజాననుడు అంటే ఏనుగు ముఖం కలిగినవాడు అని అర్థం. ఏనుగు తల బుద్ధిని సూచిస్తుంది. ఆ బుద్ధిని కనుక ఉపయోగిస్తే మనలోని లోభం (అత్యాశ, పిసినారితనం) దూరం కాకతప్పదు.

లంబోదరుడు



దేవ, రాక్షసులు కలిసి సాగరాన్ని మథించినప్పుడు చివరగా అమృతం దక్కిన విషయం తెలిసిందే! ఈ అమృతాన్ని రాక్షసులకు కాకుండా చేసేందుకు విష్ణుమూర్తి మోహినీ అవతారాన్ని ధరించాడు. మోహిని రూపంలో ఉన్న విష్ణుమూర్తిని చూసిన శివునికి కూడా మనసు చలించగా విష్ణువు తన నిజరూపంలోకి రావడంతో శివుడు భంగపడి క్రోధితుడయి క్రోధాసురుడు అనే రాక్షసుడు జనించాడు. సూర్యదేవుని ఆశీస్సులతో మహాబలవంతుడయ్యాడు. క్రోధాసురుడు ప్రీతి అనే కన్యను వివాహమాడగా హర్షం, శోకం అనే సంతానం కలిగారు. వినాయకుడు లంబోదరుని రూపంలో క్రోధాసురుడిని అణచివేశాడు. క్రోధం ఎప్పుడూ తాను ఇష్టపడిన దాని కోసం వెంపర్లాడుతుంది. ఆ వెంపర్లాటలో గెలిస్తే హర్షం, ఓడితే శోకం అనే ఉద్వేగాలు కలుగుతాయి.

వికటుడు




పూర్వం కామాసురుడనే రాక్షసుడు ఉండేవాడట. ఆ కామాసురుడు శివుని గురించి ఘోర తపస్సు చేసి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. అతని బారి నుంచి కాపాడే ఉపాయం సెలవిమ్మంటూ దేవతలంతా ముద్గల మహర్షిని వేడుకున్నారు. అంతట ఆ రుషి తదేక దీక్షతో ఓంకారాన్ని జపిస్తూ ఉంటే కనుక ఆ గణేశుడు ప్రత్యక్షమై వారి కష్టాన్ని తీరుస్తాడని సెలవిచ్చాడు. ముద్గలుని ఉపాయం పాటించిన దేవతలకు గణేశుడు వికటునిగా ప్రత్యక్షం అయ్యాడు. గణేశుని రూపు కాస్త విభిన్నంగా ఉంటుంది. అది ఒకోసారి ఓంకారాన్ని కూడా తలపిస్తుందని చెబుతారు. ఆ ఓంకార స్వరూపంతో కామాన్ని ఎదుర్కోవచ్చుననీ వికటుని వృత్తాంతం తెలియచేస్తోంది.

విఘ్నరాజు



కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు ప్రతీకగా ఇప్పటివరకూ రాక్షసులని చూశాము. ఇక మమతాసురుడు అనే రాక్షసుని కథ ఇది. శంబరుడు అనే రాక్షసుని ప్రలోభంతో మమతాసురుడు ముల్లోకాలనూ పీడించసాగాడు. దేవతల కోరిక మేరకు వినాయకుడు, విఘ్నరాజుగా అవతరించి మమతాసురుని సంహరించాడు. చిత్రంగా ఈ అవతారంలో వినాయకుడు నాగుపాముని వాహనంగా చేసుకున్నట్లు చెబుతారు. ఇక్కడ మమత అంటే దేహాభిమానానికి ప్రతీక. ఆ దేహంలోని కుండలిని జాగృతం చేసిన రోజున మోక్షానికి గల విఘ్నాలన్నీ తొలగిపోతాయి. దేహాభిమానానికి మమతాసురుడు, కుండలినికి సూచనగా నాగ వాహనం కనిపిస్తాయి.

ధూమ్రవర్ణుడు



అరిషడ్వర్గాలు అయిపోయాయి, దేహాభిమానమూ తీరిపోయింది. ఇక 'నేను' అనే అహంకారం ఒక్కటే మిగిలింది. దానికి సూచనే అహంకారాసురుడనే రాక్షసుడు. ధూమ్రము అంటే పొగ అన్న అర్థం కూడా వస్తుంది. ధూమ్రానికి ఒక ఆకారం అంటూ ఉండదు. ఒక పరిమితీ ఉండదు. సర్వవ్యాపి అయిన ఆ భగవంతుని ప్రతిరూపం ధూమ్రం. మనిషి 'తాను' అనే అహంకారాన్ని వీడి ఆ భగవంతునిలో ఐక్యం కావడానికి సూచనే ఈ అహంకారాసురుని వృత్తాంతం. 'నేను' అనే అహంకారాన్ని పక్కనపెట్టి తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేస్తూ పరులకు ఉపకారం చేస్తూ దైవ చింతనతో దైవాన్ని వెతుకుతూ మోక్షంకోసం సాధన చేయడమే దీని సారాంశం.